


ఎన్నికలకు వడివడిగా

ఉద్యోగుల్లో బదిలీల కలవరం

- మూడేళ్లు దాటినవారికి స్థాన చలనం
- జిల్లాలో భారీగా అధికారుల బదిలీలు
- ఈవీఎంల ర్యాండమైజేషన్‌పై అవగాహన
- తుది ఓటరు జాబితా సిద్ధం
- రెండు సెగ్మెంట్లలో 4.70 లక్షల మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల సెగ్మెంట్లలో అధికార యంత్రాంగం వడివడిగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల చివరిలో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో మూడేళ్లకుపైగా జిల్లాలో పనిచేస్తున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే భారీగా బదిలీలు జరిగాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న బదిలీల్లో అధికారులు కలవర పడుతున్నారు. ఎక్కడికి బదిలీ చేస్తారోనని అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది. జిల్లాలో పంచాయతీరాజ్, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖ, పోలీస్, ఎక్సైజ్, పౌర సంబంధాల శాఖల్లో బదిలీలు ఏర్పడ్డాయి. ఇతర శాఖలకు సంబంధించిన బదిలీలు రానున్నాయి. బదిలీ ఉత్తర్వులు వెలువడిన 48 గంటల్లోనే రిపోర్టు చేసే విధంగా కచ్చితమైన ఆదేశాలు వస్తున్నాయి. మంగళవారం జిల్లాలో సుదీర్ఘంగా పనిచేసిన డీపీఆర్వో మామిండ్ల దశరథం హైదరాబాద్ పౌరసంబంధాల శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన దశరథం సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డిలో పనిచేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో సిరిసిల్లలో ఇన్‌చార్జిగా పనిచేశారు. సిరిసిల్ల డీపీఆర్వోగా కరీంనగర్ కార్యాలయంలో అదనపు డీపీఆర్వోగా పనిచేస్తున్న శారదను నియమించారు. అసిస్టెంట్ డైరెక్టర్ దశరథం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించి కమిషనర్ హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఇప్పటికే అధికారుల్లో జడ్పీ సీఈవో గౌతంరెడ్డి జగిత్యాలకు బదిలీకాగా జిల్లాకు హైదరాబాద్ నుంచి ఎం.ఉమారాణి సీఈవోగా వచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్ కరీంగనర్‌కు బదిలీ కాగా అక్కడి డీపీవో వీరబుచ్చయ్య సిరిసిల్లకు వచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్యను నిర్మల్‌కు బదిలీ చేశారు. సిరిసిల్ల డీఆర్డీవో నక్క శ్రీనివాస్ మెట్‌పల్లి ఆర్డీవోగా బదిలీకాగా ఆయన స్థానంలో మంచిర్యాల డీఆర్డీవో శేషాద్రిని నియమించారు. అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు. అంతకు రెండు రోజుల ముందు జిల్లాకు చెందిన ఎంపీడీవోలు రాజేందర్‌రెడ్డి, ఎం.శంకర్, పి.రవీందర్, ఎస్ .రాంరెడ్డి, ఎం.శ్రీనివాస్, రమాదేవి, లచ్చాలు, చిరంజీవి, రామకృష్ణ జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి ఎ.రాజేందర్, రాజీవ్ మల్హోత్ర శ్రీనివాసమూర్తి, జయశీల, వై.శశికళ వచ్చారు. సిరిసిల్ల ఎస్‌డీ డీఎస్పీ రవికుమార్ బెల్లంపల్లి ఏసీపీగా బదిలీ అయ్యారు. సిరిసిల్లకు వనస్థలిపురం నుంచి భీంరెడ్డిని డీసీఆర్‌బీ డీఎస్పీగా నియమించారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎల్లారెడ్డిపేట సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ ఎస్టీఎఫ్‌కు బదిలీ చేశారు. ఎల్లారెడ్డిపేటకు పెద్దపల్లి సీఐ ఎం. శ్రీనివాస్‌ను నియమించారు. వేములవాడ సీఐ జి .రామును కరీంనగర్ అర్బన్‌కు బదిలీ చేయగా సత్తుపల్లి సీఐ వి.రాజశేఖర్‌రావును వేములవాడకు పంపించారు. సిరిసిల్ల ఎస్సై కె.విజేందర్‌ను కొత్తగూడెంకు బదిలీ చేశారు. ధర్మపురి ఎస్సై కె.శ్రీనివాస్ వేములవాడకు బదిలీపై వచ్చారు. ఇప్పటికే డిప్యూటేషన్లపై ఉన్న వారిని రద్దు చేశారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్

కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ర్యాండమైజేషన్‌పై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈవీఎంలపై అవగాహన పెంపొందించడానికి కలెక్టరేట్‌లో ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు కావాల్సిన సిబ్బంది వివరాలను సేకరించారు.

లోక్‌సభ ఎన్నికలపై పార్టీల దృష్టి

లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్‌లోనే జరిగే అవకాశం ఉండడంతో వివిధ పార్టీలు సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో పట్టు సాధిందుకు సమాయత్తమవుతున్నాయి. ప్రస్తుత కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రజాహిత యాత్ర పేరిట రెండు నియోజకవర్గాల్లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది స్పష్టత లేకపోయినా అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రెండు సెగ్మెంట్లలో 4.70లక్షల మంది ఓటర్లు

లోక్‌సభ ఎన్నికల కోసం తుది ఓటరు జాబితా వెల్లడించారు. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లకు సంబంధించి 4 లక్షల 70 వేల 438 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించారు. సెగ్మెంట్లలో ఎన్నికల సమయంలో ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఓట్లు వేసే పరిస్థితులు లేకుండా ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చారు. పోలింగ్ కేంద్రాల్లో 1500 మంది ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు చేపట్టారు. రెండు సెగ్మెంట్లలో 4,70,438 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,26,923 మంది, మహిళలు 2,43,475 మంది, 40 మంది జెండర్ ఓటర్లు ఉన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకారం 4,67,905 ఓటర్లు ఉండగా స్వల్పంగా ఓటర్లు పెరిగారు. 2533 మంది పెరుగుదల ఉంది. శాసనసభ ఎన్నికల సమయంలో రెండు సెగ్మెంట్లలో 4,58,958 మంది ఓటర్లు ఉండగా 11,480 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం తుది జాబితా ప్రకారం వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,323 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,783 మంది, మహిళలు 1,17,508మంది జెండర్‌లు 32 మంది ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,55,115 మంది ఉండగా పురుషులు 1,19,140 మంది, మహిళలు 1,25,967 మంది, జెండర్‌లు ఎనిమిది మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో సర్వీస్ ఓటర్లు 159 మంది ఉండగా వేములవాడలో 53 మంది, సిరిసిల్లలో 106 మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4,70,438 మంది ఓటర్లు ఉండగా మహిళలు అధికంగా 16,552 మంది ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,323 మంది ఓటర్లు ఉండగా మహిళలు 9725 మంది, సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,45,115 మంది ఓటర్లు ఉండగా మహిళలు 6827 మంది అధికంగా ఉన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని గీతా మందిరం వార్షికోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని వరంగల్, చెన్నూరు, హైదరాబాద్, కరీంనగర్ పట్టణాలకు చెందిన పురోహితులు విద్యాఫణిధరశాస్త్రి, సందీప్‌శర్మ, అంజనీకుమార్‌శర్మ, నరహరిశర్మల వేద మంత్రోచ్ఛరణ నడుమ శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం రాధాకృష్ణస్వామి ఎదుర్కోలు వేడుకలను నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

సేవాభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ఉద్యోగుల విధి నిర్వహణలో బదిలీలు సహజమని, ప్రజలకు వారు అందించిన సేవలు ప్రజల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి బదిలీపై వెళ్తున్న జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీపీఆర్వో దశరథం, ఎస్డీసీ గంగయ్య, అదనపు డీఆర్డీవో మదన్ మోహన్, కలెక్టరేట్ జీ సెక్షన్ పర్యవేక్షకుడు రమేష్‌తో పాటు మరి కొందరిని జిల్లా అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ అనురాగ్ జయంతి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల తమ జీవిత కాలం వివిధ చోట్ల విధులు నిర్వర్తిస్తారని, ఆ సమయంలో ఉద్యోగులు అందించే సేవలు గుర్తింపు ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూదన్, డీటీఓ కొండల్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆంగ్ల భాషా నైపుణ్యాభివృద్ధిలో 'ఎల్టా' కృషి హర్షణీయం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13 : ఆంగ్ల భాషా నైపుణ్యాభివృద్ధిలో ఎల్టా కృషి హర్షణీయమని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంగ్లభాషాలో నాటిక, స్పెల్ విజార్డ్ జిల్లా స్థాయి పోటీలను ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మోడల్ స్కూల్, కేజీబీవీ విభాగాల్లో డ్రామా కాంపిటేషన్స్‌లో ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులు, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో డ్రామ కాంపిటేషన్‌లో ముస్తాబాద్ మండలం అవునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని గెలుచుకున్నారు. స్పెల్ విజార్డ్‌లో మోడల్ స్కూల్, కేజీబీవీల విభాగంలో రుద్రంగి కేజీబీవీకి చెందిన శ్రావణ్య, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గంభీరావుపేట మండలం ముచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నవదీప్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అధ్యక్షుడు చేరాల తిరుపతి ప్రకటించారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన సిరిసిల్ల విద్యాసాగర్‌ను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్టా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేరాల తిరుపతి, రాజులింగాల, గన్నమనేని శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎంఈవో దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయిని లోకినిశారద, సభ్యులు పురుషోత్తం, పద్మలత, మీనాక్షి, రమేష్, రహీం, జ్రముత్‌సుల్తానా, లకుమ్ సదానందం,

ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ డ్రామాలు

కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతామనే భావనతో కాంగ్రెస్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు డ్రామాలు ఆడుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కేసీఆర్ రూ. లక్షల కోట్లు దోచుకున్నారని, కేంద్ర కమిటీ, నిపుణులు నివేదిక అందజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో సీబీఐ విచారణపై ఎందుకు తీర్మానం చేయలేదని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్‌లో మంగళవారం రాత్రి పాదయాత్ర చేశారు. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లిలో అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల వాటాపై నల్గొండలో బీఆర్ఎస్‌కు సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రులు కాళేశ్వరాన్ని గతంలోనే సందర్శించి నాణ్యత లేదని పేర్కొన్నారని, శాసన సభను వాయిదా వేసి ఎందుకు సందర్శనకు వెళ్లారని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన బీఆర్ఎస్, కాంగ్రెస్ శాసనసభ ప్రతిష్టను దిగజార్చుతున్నాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల ప్రకటన రాబోతోందని గమనించిన కాంగ్రెస్ తమ హామీలు నెరవేర్చలేమని ఎన్నికల షెడ్యూలు సాకుతో తప్పించుకోవాలని చూస్తుంటే నిలదీయాల్సిన బీఆర్ఎస్ అందుకు సహకరిస్తోందని ఆరోపించారు. స్వయం ప్రకటిత మేధావి తనపై మాట్లాడుతున్నాడని, కేంద్రం చేసిన అభివృద్ధిని వివరిస్తుంటే ఎందుకు అంత అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు.

టిక్కెట్ కోసం కొడుకు పేరు మార్చిన కేసీఆర్

కేసీఆర్ తెలుగుదేశం పార్టీలో టికెటు కోసం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు వద్దకు కల్వకుంట్ల అజయ్‌రావుగా ఉన్న తన కొడుకును తీసుకెళ్లి కే. తారకరామారావు అని పేరు మార్చారని బండి సంజయ్ ఆరోపించారు. పాస్‌పోర్టు బ్రోకర్, ముడతల చొక్కాలు వేసుకున్న మీ పుట్టుపూర్వోత్తరాలు తన వద్ద ఆధారాలతో ఉన్నాయని పేర్కొన్నారు. మీ బండారం బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, తన సవాల్‌ను స్వీకరించి సిరిసిల్ల అంబేద్కర్ విగ్రహం వద్దకు కేసీఆర్, కేటీఆర్‌కు వచ్చే దమ్ముందా? అన్నారు.



గొల్లపల్లిలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల అభివృద్ధికి కేంద్రం నిధులు రూ.1408 కోట్లు

కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల జిల్లా అభివృద్ధికి రూ.1408 కోట్లు కేటాయించిందని బండి సంజయ్ అన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.387.04 కోట్లు, మెటీరియల్‌కు రూ.213 కోట్లు, మొక్కల పెంపకానికి రూ.266.86 కోట్లు, 14, 15 ఆర్థిక సంఘం నిధుల కింద రూ.155 కోట్లు, మరుగుదొడ్లు, కిసాన్ సమ్మాన్ నిధి, సడక్ యోజన పథకం కింద నిధులు కేటాయించామని పేర్కొన్నారు. సిరిసిల్ల నియోజక వర్గానికి రూ.660 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. మొక్కల పెంపకానికి రూ.కోట్లు కేటాయిస్తే నాటిన మొక్కలు ఎక్కడికి పోయినయని ప్రశ్నించారు. .

- దేశంలో నరేంద్రమోదీ గాలి వీస్తోందని బండి సంజయ్ అన్నారు. 500 ఏళ్ల కల అయోధ్య రామమందిరం నిర్మాణం చేపట్టారన్నారు. పార్లమెటు ఎన్నికల్లో తెలంగాణలో 17 స్థానాలు సాధిస్తామని బండి సంజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన మహిళలు, నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, నాయకులు తిరుపతిరెడ్డి, సుజాత, బుగ్గారెడ్డి, సత్యంరెడ్డి, శ్రీనివాస్, బాపురెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాహిత యాత్ర

వీర్నపల్లి : మారుమూల పల్లెల అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ ప్రజాహిత యాత్ర చేపట్టినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంతోపాటు గర్జనపల్లి, వన్‌పల్లి, రంగంపేటలో మంగళ వారం ప్రజాహిత యాత్ర సాగింది. యాత్రలో భాగంగా గర్జనపల్లికి చేరుకున్న ఆయనకు మహిళలు, నాయకులు, కార్యకర్తలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. మండలకేంద్రంతో పాటు వన్‌పల్లిలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీజేపీ జెండాను ఎగరవేశారు. గర్జనపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఎంపీ నిధులతో వారం రోజుల్లో వాటర్ ప్లాంటును ఏరాటు చేస్తానని హామీ ఇచ్చారు. వన్‌పల్లిలో సేవాలాల్ ఆలయ నిర్మాణ కోసం రూ. 5లక్షల నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. సమ్మక్క సారలమ్మ జాతర కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. పోడుభూముల సమస్య పరిష్కరించాలని కొందరు రైతులు, వన్‌పల్లిలో మహిళా సంఘం భవనం మంజూరు చేయాలని మహిళలు కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక నిధులు ఇస్తానన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా మరోసారి ఆదరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిని గోపి, పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, రాష్ట్ర నాయకులు అల్లాడి రమేష్, సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి, జిల్లా దిశా కమిటీ సభ్యుడు పీర్యా, ఎస్టీ మోర్చా ప్రధానకార్యదర్శి రమేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు తిరుపతి, యువ మోర్చా బండారి మహేష్, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: జిల్లాలో 2024- 25 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు ప్రైవేటు, ఆంగ్లమాధ్యమ పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ రెసిడెన్షియల్ 5వ తరగతి పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ ఫీ, హాస్టల్, భోజన వసతితోపాటు రెండు జతల స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, ప్రతీ విద్యార్థికి సంవత్సరానికి రూ.42వేల చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నాన్ రెసిడెన్షియల్ 1వ తరగతి పథకంలో విద్యార్థులకు ట్యూషన్ ఫీజుతోపాటు రెండు జతల స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, ప్రతివిద్యార్థికి సంవత్సరానికి రూ.28 వేల చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీలోగా సమర్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు.

21న రేషన్ బియ్యానికి బహిరంగ వేలం

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : జిల్లాలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న రేషన్ బియ్యాన్ని ఈ నెల 21న బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనం చేసుకున్న సుమారు 461.40 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు టెండర్ ఫీజు (ఈఎండీ) రూ.3వేలు, జిల్లా సివిల్‌సప్లయ్ అధికారి రాజన్న సిరిసిల్ల జిల్లా పేరు మీదా డీడీ తీయాలని తెలిపారు. డీడీల డబ్బులు తిరిగి చెల్లించబోమని పేర్కొన్నారు. రూ.లక్ష ధరవాతు కోసం జిల్లా పౌర సరఫరాల అధికారి రాజన్న సిరిసిల్ల పేరుతో డీడీతో సహా సిద్ధపడి హాజరు కావాలని తెలిపారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లతో డీడీలను అందజేయాలని, వివరాల కోసం జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో లేదా సెల్ నంబరు 8008325850లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



నివాళి అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని మహిళా సాధికారిక కేంద్రం జిల్లా సంక్షేమ అధికారి మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా మహిళా ప్రాంగణం అధికారి సునంద, డీ హబ్ కోఆర్డినేటర్ రోజా, కార్యాలయ సిబ్బంది అంజలి, శోభన, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాజన్న సేవలో బీజేపీ నేత మురళీధర్‌రావు



ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 13 : బీజేపీ జాతీయ నేత, మధ్య ప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్ రావు వేములవాడ రాజ రాజేశ్వరస్వామిని మంగళ వారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండ పంలో అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : సైబర్ సెక్యూరిటీపై ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్సై ప్రమీల అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిలతోగానీ, మరే విధమైన వేధింపులుగానీ ఎదుర్కొంటే షీటీమ్‌ను సంప్రదించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు అన్యాయానికి గురైనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. 8712656425 నంబరుకుగానీ 100గానీ డయల్ చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్, అధ్యాపకులు శ్రీదేవి, రవి తదితరులు ఉన్నారు.


ఇల్లంతకుంట ఎంపీడీవోగా శ్రీనివాసమూర్తి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 13: ఇల్లంతకుంట ఎంపీడీవోగా శ్రీనివాసమూర్తిని నియమిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంపీవో మీర్జా ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. శ్రీనివాసమూర్తి పెద్దపల్లి జిల్లా నుంచి ఇల్లంతకుంటకు బదిలీపై వచ్చారు.

పారిశుధ్యం నిర్వహణకు ప్రత్యేక చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ రేణుక చెప్పారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు అల్మాస్‌పూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, వెంకటాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా అల్మాస్‌పూర్‌లో ఎంపీపీ రేణుక స్థానిక అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలో ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారి, స్థానికులతో కలిసి శ్రమదానం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేణుక మాట్లాడుతూ ప్రజలు, యువజన, కుల, మహిళా సంఘాల సభ్యులు పారిశుధ్య పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





వ్యవసాయ బావిలో మొసలి

రాయికల్, ఫిబ్రవరి 13: మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో కుర్ర శేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మొసలిని గుర్తించారు. ఈ సందర్భంగా భయాందోళనకు గురైన శేఖర్ గ్రామస్థుల సహాయంతో మొసలిని పట్టి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వ్యవసాయ బావిలోని నీరు ఎండిపోవడంతో మొసలి కనబడిందని, లేకుంటే ప్రమాదం పొంచి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు.


బావి నుంచి బయటకు తీసిన మొసలి

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బోనం మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 13: రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: అనారోగ్యంతో బాధపడుతున్న గౌతమినగర్‌కు చెందిన అమ్మిగల్ల చంద్రయ్య(46) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. మున్సిపల్‌లో కూలీగా పనిచేస్తున్న చంద్రయ్య అనారోగ్యంతో మందులు వాడుతున్నప్పటికీ నొప్పి తగ్గక పోవటంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరు నిందితులకు సోమవారం, మరొక నిందితుడికి మంగళవారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ టి నరేష్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన మామిడి అర్జున్‌కు 3,658 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలుశిక్ష, కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన పొత్తూరి సుధాకర్‌కు 13,621 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన వరికోలు సంపత్‌కు 4,691 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూలు విడుదల


గణేశ్‌నగర్ ఫిబ్రవరి13: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న పీజీ మొదటి సెమిస్టర్, సిబిసిఎస్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి2 వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వీ గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.


విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 13: విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్‌పి) ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డిఎస్‌యు) నాయకులు గీతాభవన్ నుంచి కలెక్టరేట్ వరకు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. సూర్యాపేట జిల్లా దురాజుపల్లి సమీపంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి వైష్ణవి, భవ్య, సూర్యాపేట దగ్గుపాటి వైష్ణవి, మాదాపూర్ నారాయణ ఐఐటి అకాడమీ వినయ్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన అధికారులను శిక్షించాలని, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దగ్గుబాటు వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయకపోతే ధర్మ సమాజ్ పార్టీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ సదానందం, జిల్లా అధ్యక్షురాలు సాధన, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, జిల్లా నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.











మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి


ఏలిమి పవన్ (ఫైల్)

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: హుజూరాబాద్‌లోని పర్కాల క్రాస్‌రోడ్ సమీపంలో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని సోమవారం అర్ధరాత్రి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామానికి చెందిన ఏలిమి పవన్ (24) అనే యువకుడు పర్కాల క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వెనుక వైపు నుంచి వరంగల్ జిల్లా వాసి మోటర్ సైకిల్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతో పవన్‌కు తీవ్ర గాయాలు కాగా వరంగల్‌కు తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ టౌన్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 13: ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన వేములవాడ మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎనుగంటి గ్రామానికి చెందిన ఏనుగుల గణేష్, నేరెళ్ల అజయ్ అనే యువకులు మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ టైర్ పంచర్ చేయించుకుని ఎనుగంటి నుంచి హనుమాజీపేట వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో కల్వర్టు పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్


కోనరావుపేటలో బండి సంజయ్‌ని సన్మానిస్తున్న ప్రజలు

కోనరావుపేట, ఫిబ్రవరి 13: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని, ప్రజల కోసం భారతీయ జనతా పార్టీ కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని దేశం అంతా ఆశ్చర్యపోతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కోనరావుపేట మండలంలోని నాగారం, కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో మంగళవారం ప్రజాహిత యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు పాల్గొని బండి సంజయ్‌కి స్వాగతం పలికారు. నాగారంలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి ప్రజాహితయాత్ర ప్రారంభించారు. అనంతరం నాగారం, కోనరావుపేటలో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో శ్రీరాముడి గుడి కడితే దేశమంతా ప్రజలు పూజలు చేశారు. జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ మనకు రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క రూపాయి వసూలు చేస్తున్నాడని అన్నారు. ఎలా దోపిడీ చేయాలో అనేది కుట్రలు చేస్తూనే ఉంటాడన్నారు. వేములవాడ నియోజకవర్గానికి రూ.572 కోట్ల 91 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఉపాధి పనుల కోసం 182 కోట్ల 80 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. మెటీరియల్ ఖర్చు కోసం 86 కోట్లు మొక్కల పెంపకానికి రూ. 92 కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ఇన్ని నిధులు కేటాయిస్తే మొక్కలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. కేసీఆర్ ఈ పైసలు అన్నిటినీ దారి మళ్లించాడన్నారు. ఒక్క నాగారం గ్రామానికే నాలుగు కోట్లు ఖర్చు చేశామన్నారు. బీజేపీ కార్యకర్తలను కేసీఆర్ జైల్లో పెట్టించాడని ఇదంతా ప్రజల కోసమే చేశామని అన్నారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు రైతుబంధు, రుణమాఫీ వేయలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చింది అని చెప్పి ఓట్లు వేయించుకుంటారని అన్నారు. అధికారులు కాళేశ్వరంపై సర్వే చేసి నివేదిక ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ మంత్రులు హెలికాప్టర్‌లో కాళేశ్వరం వెళ్లొచ్చారు.. ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కృష్ణ నీటిపై, నల్గొండలో సభ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష కోట్ల ధనాన్ని వృధా చేశానని ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పదేళ్ల పాలనలో కెసీఆర్ ఆస్తులు పెరిగాయని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిరియాల్‌కార్ బాలాజీ, రేగుల మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్

● కరీంనగర్‌లోని ఇంటిలో సోదాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: శామీర్‌పేట తహసీల్దార్ తోడేటి సత్యనారాయణ మంగళవారం 10 లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) పోలీసులకు హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సత్యనారాయణకు చెందిన ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని పత్రాలు సీజ్ చేశారు. సత్యనారాయణ భార్యను ఏసీబీ అధికారులు విచారించారు.


విద్యానగర్‌లోని శామీర్‌పేట తహసీల్దార్ నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ మాస్టర్ అథ్లెట్ ఎ.మధుసూదన్(74) ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభచాటి అండర్-75 విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో బంగారు పతకం, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకం సాధించిన ఆయన అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెరియాల రవీందర్‌రావు, సభ్యులు, వాకర్స్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ తెలంగాణ, మహారాష్ట్ర విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. బి.ఆదిత్యారావు, జి.శ్రీహాస్, సుభోద్‌చౌదరి, ఎం.శ్రీరాం, ప్రణీత్, నిఖిల్‌చొప్రా, ఎ.శివవరుణ్, సిహెచ్ అనూహ్య, పి.రఘువీర్‌రెడ్డి, సత్యఅమూల్య, షఫీక్, శివశంకరవరప్రసాద్, శ్రీనిధి, ఎం.ప్రహర్ష్, ఎం.పూనిత్ మనోహర్, రవిచంద్ర అద్భుతమైన పర్సంటైల్ సాధించారని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం


డి.మనీష్


టి.తేజస్వి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్‌ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వి 99.95 శాతం, ఆర్.దీపాన్షరెడ్డి 99.19 శాతం, పినిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

ప్రతిభ చాటిన అలుగునూర్ ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థులు


కరీంనగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో కరీంనగర్ పరిధిలోని అలుగునూర్‌లో గల ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఎస్‌ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇంఛార్జ్ నేదూరి తిరుపతి తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాలకు చెందిన జి.రాజీవ్(99.2) పర్సంటైల్‌తో అత్యున్నత ప్రతిభ కనబరచగా, జి.శ్రీవాత్సవ్(98.5), ఎన్.వినూత్న(98.22), బి.రిషిత్(98), బి.క్షేత్ర(96.5), డి.రోహన్(96), ఏ.ఆశ్వక్(94.09),కె.ఒమేశ్వర్(92.21), వి.శ్రీహరిణి(90) పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటి ప్రతిభ


వర్షితరాణి


శ్రీతేజ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో ట్రినిటి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణాళికతో, అకుంఠిత దీక్షతో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఫలితాల్లో వర్షితరాణి 99.53 పర్సంటైల్, వి.శ్రీతేజ 98.49 పర్సంటైల్, ఎం.మణితేజ 97.75 పర్సంటైల్ సాధించారన్నారు. మరెన్నో ఉత్తమమైన ఆమోదయోగ్యమైన ఫలితాలు సాధించామన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానంతో చక్కని ప్రణాళికతో విద్యను అందిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13: ప్రజాస్వామ్య పక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో సామాజికంగా మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ఆనాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో ఏ పదవి ఖాళీ అయినా దానిని ఆరు నెలల్లో ఎన్నిక ద్వారా భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కానీ జగిత్యాలలో మాత్రం ఇవేమీ పాటించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ కరోనాతో మృతి చెందగా, జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ బోగ శ్రావణి తన పదవితో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో పదవులు ఖాళీ అయినా ఆ స్థానాలకు ఎన్నిక నిర్వహించకపోవడంతో మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ హక్కులు కోల్పోతున్నారన్నారు. బీసీలకు కేటాయించిన సీట్లలో ఉన్నత వర్గాలకు చెందిన వారు కొనసాగుతుండడంతో బీసీలు తమ హక్కులను కోల్పోతున్నారన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, బండ శంకర్ ఉన్నారు.

ఖాతాదారుల డబ్బులు కాజేస్తున్న సైబర్ మోసగాళ్లు

● ధర్మారం మండలంలో వరుస ఘటనలు
● తాజాగా రూ.29,500 డ్రా

ధర్మారం,ఫిబ్రవరి13: సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాదారులపై కన్నేశారు. బ్యాంకులో డబ్బులున్నాయని అవసరానికి తీసుకుందామని వెళ్తే ఖాతా ఖాళీకావడంతో అవాక్కవుతున్నారు. తమకు తెలియకుండా డబ్బులు డ్రా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం నందిమేడారంలో సందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతాలో నుంచి అతనికి తెలియకుండానే రూ. 10వేలు డ్రా కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా మంగళవారం మరో మోసం కేసు నమోదైంది. ధర్మారం మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన దారవేని పోచాలు ఎస్‌బీఐ ఖాతా నుంచి మూడు విడతలుగా ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ మెమెంట్) ద్వారా రూ.29వేల 500లను సైబర్ నేరగాళ్లు డ్రా చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఖాతా నుంచి తనకు తెలియకుండా గత ఏడాది డిసెంబరు31న రూ.10వేలు, ఈ ఏడాది జనవరి 2న రూ. 9వేల 500, జనవరి 4న రూ.10వేలు మొత్తం రూ. 29వేల 500 డ్రా జరిగినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

విచారణ చేస్తున్న పోలీసులు

ధర్మారం మండలంలో ఇద్దరి ఎస్‌బీఐ ఖాతాలో నుంచి రూ.39వేలను వేర్వేరు తేదీలలో సైబర్ నేరగాళ్లు డ్రా చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఒక వైపు సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు ఎక్కడో ఒకచోట మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇటీవల ఎక్కువగా భూముల రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వేలిముద్రలను ఉపయోగిస్తుండడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతే కాకుండా కంప్యూటర్ సెంటర్‌లలో కూడా ఎవరైనా ఈ నేరాలకు పాల్పడుతున్నారా? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాల్లో భద్రంగా డబ్బులుంటాయని నమ్మకం లేకుండా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు బ్యాంకు ఖాతాదారులు భయాందోళన చెందుతున్నారు. మోసాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

రైతుబంధు పేరుతో మోసం

కొడిమ్యాల, ఫిబ్రవరి 13: మండలంలోని నాచుపల్లిలో సోమవారం జరిగిన ఆన్‌లైన్ మోసంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఖాతా నుంచి రూ.1.25 లక్షలు మోస పోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు నాచు పల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్యకు రైతు బంధు డబ్బులు 21 వేలు మంజూరయ్యాని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు కోరాడు. వివరాలు అందు బాటులో లేకపోవటంతో ఇంటి పక్కనే ఉన్న సంధ్య అనే మహిళ బ్యాంక్ వివరాలను సదరు వ్యక్తికి తెలిపింది. బ్యాంక్ ఖాతాకు పూర్తి వివరాలు సరిపోవటం లేదని మళ్లీ ఫోన్ రావటంతో సంధ్య కుటుంబ సభ్యులైన సుమన్, రమేష్‌కు చెందిన బ్యాంక్ వివరాలు తెలిపారు. కొద్ది సేపటికి ముగ్గురి ఖాతాలో నుంచి రూ.1,25,408 రూపాయలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె అమర్చిన వ్యక్తి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 13: అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చిన గుగులోతు తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం రూప్లా నాయక్ తండా శివారులోని గుగులోతు తిరుపతి పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. దీంతో హరిసింగ్ అనే రైతుకు చెందిన గేదె కంచెకు తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. హరిదాస్ ఫిర్యాదుతో తిరుపతిపై ఆదివారం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మంగళవారం తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా పొలాలకు విద్యుత్ కంచెలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామానికి చెందిన రాజనర్సు (60) మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజనర్సు (60), శివయ్య, అనంత రెడ్డి ఈ నెల 8న కూలి పని కోసం వరదవెల్లి వచ్చారు. రోడ్డు పక్కన ముగ్గురు మాట్లాడుకుంటుండగా పెగడపల్లి మండలం బత్కపల్లికి చెందిన మారుతి కారు అతివేగంగా వచ్చి ముగ్గురిని ఢీకొట్టింది. ముగ్గురికి గాయాలు కాగా రాజనర్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి 13: పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పొన్నం లచ్చయ్యకు చెందిన గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఇంటి ముందు స్తంభానికి కట్టివేసిన గేదెపై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందినట్లు గ్రామస్థులు, బాధిత రైతు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే గేదె మృత్యువాత పడటంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. రైతుకు ప్రభుత్వం విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, రైతులు కోరారు.

పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య


సల్లె రమేష్(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా పిల్లలు పుట్టడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు రైల్వేట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినీత తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన సల్లె రమేష్ (33)కు స్రవంతితో వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతోంది. అయితే వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన రమేష్ మద్యంకు బానిసగా మారాడు. ఇంట్లో తల్లి, అతని భార్య తాగుడు వద్దని చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన రమేష్ మద్యం తాగి ఇంటికి రాగా తల్లి సమ్మక్క మందలించడంతో ఇంటి వెనకాల రైల్వే ట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వివరించారు. మృతునికి భార్య స్రవంతి, తల్లి సమ్మక్క ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వెల్గటూర్, ఫిబ్రవరి 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాళ్లకొత్తపేట గ్రామా నికి చెందిన ఎల్కటూరి లక్ష్మీనారాయణ (35) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మీనారాయణ గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సౌందర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నకల్వలలో యువకుడు..


సుధీర్‌రావు (ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామంలో గౌరవెల్లి సుధీర్‌రావు (30) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు మంగళవారం ఉదయం ఉరి వేసుకోవడంతో సాయంత్రం సంఘటన వెలుగు చూసింది. భార్య అవణి కొన్నిరోజుల క్రితం అమె పుట్టింటికి వెళ్లింది. తల్లి స్వర్ణ అలియాస్ పద్మ సుగ్లాంపల్లిలో అంగన్ వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన అజ్మతుల్లా హుస్సేనీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అజ్మతుల్లా హుస్సేనీ

గంభీరావుపేట, ఫిబ్రవరి 13 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అజ్మతుల్లా హుస్సేనీని సీఎం అభినందించారు.

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రవక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియామకమైన గంభీరావుపేట మండలానికి చెందిన అజ్మతుల్లాహుస్సేన్‌ను ఎల్లారెడ్డిపేట మండలంలోని మైనార్టీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నాయకులు సాహెబ్, తాజొద్దిన్, రఫీ, జహంగీర్, గౌస్ పాల్గొన్నారు.

భూమిని తిరిగి రైతులకు అప్పగించాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో జయవరం రోడ్డు వైపు ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి రైతులకు అప్పగించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు డిమాండ్ చేశారు. తిప్పాపూర్ శివారులోని భూమిని పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సీపీఐ ఎమ్మెల్యేగా రాజేశ్వర్‌రావు ఉన్న సమయంలో నిరుపేదలకు 33 ఎకరాల భూమిని ఇచ్చారని, ఆ భూమిని డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని చెప్పి రైతుల వద్ద నుంచితీసుకున్నారని అన్నారు. ఇళ్ల కట్టకపోవడంతో ఆ భూమి ఖాళీగా ఉందని, తిరిగి ఆ భూమిని సంబంధిత రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎల్లా దేవరాజు, కోరెపు శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు బడ్జెట్‌లో అన్యాయం

రుద్రంగి, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం హరీష్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ప్రజలపై గత పాలకులు చేసిన నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వంగా కొనసాగిస్తోందని ఆరోపించారు. కుల వృత్తులపై ఆధారపడిన బీసీ వర్గాలకు కేవలం రూ. 8 వేల కోట్లు మాత్రమే ప్రకటించి వారి అభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. నాయకులు గంగాధర్, సతీష్, రమేష్, అజయ్ పాల్గొన్నారు.

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

చందుర్తి, ఫిబ్రవరి 13: చందుర్తి మండలంలోని ఉన్నత పాఠశాలలో నిరంతర సమగ్ర మూల్యాంకణంలో భాగంగా మంగళ వారం 10వ తరగతి ఇంటర్నల్ మార్కులను తనిఖీ బృందాలు పరిశీలించాయి. సీసీఈ, ఇంటర్నల్ పరిశీలన బృందం ఉన్నత పాఠశాలను సందర్శించి, సంబంధించిన రికార్డులను పరిశీలించాయి. ఆయా పాఠశాలల నిర్వాహకులు అన్ని రిజిష్టర్లను రికార్డులను సిద్ధంగా ఉంచాలని సభ్యులు ఆదేశించారు. బృందంలో సునీత, అంజయ్య మహేష్ వనిత ఉన్నారు.

16న దేశవ్యాప్త కార్మిక సమ్మె

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ ప్రధాని మోదీ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గురుకులాల పీజీటీ ఫలితాల్లో గొల్లపల్లి యువకుడికి 17వ ర్యాంక్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల ప్రకటించిన పీజీటీ పరీక్ష ఫలితాల్లో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన యువకుడు రాగం వెంకటేశ్ సత్తా చాటాడు. 172.75 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 17 వ ర్యాంక్ సాధించాడు. గ్రామానికి చెందిన లక్ష్మీ- లక్ష్మీనారాయణ దంపతుల కుమారుడు వెంకటేశ్. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ ఎమ్మెస్సీ జువాలజీ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ రిజర్వ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల రిక్రూట్‌మెంటు బోర్డు నిర్వహించిన పీజీటీ పరీక్షలకు హాజరయ్యాడు. ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంక్ సాధించాడు.

నేడు బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

ముస్తాబాద్, ఫిబ్రవరి 13:ముస్తాబాద్ మండలంలో బుధవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర చేపడతారని బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని చిప్పలపెల్లి, నామాపూర్, ముస్తాబాద్, తెర్లుమద్ది గ్రామాల మీదుగా యాత్ర కొనసాగుతుందని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మెంగని మహేందర్, కరెడ్ల రమేశ్‌రెడ్డి, మల్లారపు సంతోష్‌రెడ్డి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను సినిమాకు తీసుకెళ్లిన అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 13: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆహ్లాదం అందించేందుకు మంగళవారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని విమల్ టాకీస్‌కు మంగళవారం సినిమాకు తీసుకెళ్లారు కలెక్టర్ ఆదేశాల మేరకు సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడులోని రంగినేని మోహన్‌రావు వృద్ధుల ఆశ్రమంతోపాటు తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న 25 మందిని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం ఆధ్వర్యంలో సినిమాను చూపించారు. కార్యక్రమంలో అరుణ్‌భాస్కర్‌రావు, సంతోష్‌కుమార్, మమత. రంగినేనిట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

నాటు బాంబు పేలి గేదెకు తీవ్ర గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 13: కోనరావుపేట మండలం మరిమడ్ల హామ్లెట్ గ్రామం అహమ్మద్ హుస్సేన్ పల్లెలో నాటుబాంబు పేలి గేదెకు మూతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కోల శ్రీనివాస్ గేదె మిగతా గేదెలతో మేత కోసం తీసుకెళ్లారు. అహమ్మద్ హుస్సేన్ గ్రామ సమీపంలో మేత మేస్తూ నాటుబాంబును కొరికింది. నాటు బాంబు పేలడంతో మూతి భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా బాంబు పేలడంతో గేదెల కాపరి భయాందోళన గురయ్యాడు. వేటగాళ్లు అటవీ జంతువుల కోసం నాటుబాంబులు తీసుకెళ్తుండగా పడిపోయినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం



భక్తులతో రద్దీగా ఉన్న ఆలయ పరిసరాలు

మల్యాల, ఫిబ్రవరి 13: కొండగట్టు ఆంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో వేలాదిగా కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సమ్మక్క సారక్క భక్తులతో రద్దీగా మారింది. సమ్మక్క సారక్క దర్శనాల ముందు కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలివస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరి సరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ప ర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్ప డింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో ని త్యం జరిగే అభిషేకాలు, సత్యనారయణ వ్ర తాలు, వాహనపూజలు నిలిపి వేశారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ, ఫిబ్రవరి 13: మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మార్చి 7వ తేదీ నుంచి 9వరకు వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు, గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల పురోగతిపై స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుడిచెరువు ప్రాంగణంలో 90 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న శివార్చన స్టేజ్ పనులను మహాశివరాత్రి జాతరలోగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం తగదని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు శివార్చన స్టేజ్‌ను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుడిచెరువు ప్రాంగణంలో భక్తుల కోసం షెడ్‌లు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

రూ.12 కోట్లతో చేపడుతున్న గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు ఎంతమేరకు పనులు పూర్తయ్యాయనే వివరాలను ఆరా తీశారు. సివిల్ పనులు పూర్తయ్యాయని, రెయి లింగ్ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివ రించారు. ల్యాండ్ స్కేపింగ్, ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అబ్బురపరిచేలా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేములవాడ పట్టణంలో తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు 600 మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ, డ్రెయినేజీ నిర్మాణం, రోడ్డుపై లేయర్ పనులను చేపట్టి మహాశివరాత్రి జాతరలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బీటీ రోడ్ విస్తరణ, రోడ్డుపై లేయర్ నిర్మాణ పనులను చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. పంచాయతీ రాజ్ ఈఈ సూర్య ప్రకాష్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్ కుమార్, ఆలయ ఈఈ రాజేష్, పర్యాటక శాఖ ఏఈ జీవన్‌రెడ్డి ఉన్నారు.

దాచారం గ్రామానికి సాగునీరు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 13: మండలంలోని దాచారంలో పంటలు ఎండిపోతున్నా సాగునీరు ఇవ్వడం లేదని, వెంటనే విడుదల చేయాలని గ్రామరైతులు, యువకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారికి యువజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కాళేశ్వరం జలాలు సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం విఠాలాపూర్ గ్రామరైతులకు ఇస్తున్నారని, దాచారం గ్రామానికి ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రంగనాయకసాగర్‌లోని నీటిని దాచారం గ్రామానికి ఇవ్వాలని, కొంత మంది రైతుల భూములకు నష్టమని అడ్డుచెప్పడంతో నీటిని విడుదల చేయడం లేదన్నారు. ఇల్లంతకుంట మండలానికి చెందిన ప్రభుత్వ భూములకు సంబంధించి సిద్దిపేట జిల్లా రైతులకు ఎలా పట్టాలు ఇచ్చారని ప్రశ్నించారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ జావెద్ అహమ్మద్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినా ఆందోళన కొనసాగించారు. చివరకు ఇంజనీరింగ్, అటవీశాఖ అధికారులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. నాయకులు హరీష్, గజ్జల శ్రీనివాస్, రజనీకాంత్, కిషన్, అనీల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకున్న యువజన సంఘాల అధ్యక్షుడు

రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఒంటిపై పెట్రోలు పోసుకొన్నాడు. దీనితో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నా ఇలాంటి చర్యలు సరికాదని అధికారులు సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



పెద్దూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 13: గ్రామాల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాసరావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో మంగళవారం రాత్రి దొంగతనాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా, లేదా ఇతర భాషల్లో మాట్లాడుకుంటూ తిరుగుతున్న వారిని గమనించినా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్, గ్రామస్థులు సలేంద్రి వేణుగోపాల్ యాదవ్, షేక్ అలీ, మంగ రమేష్, లడ్డుభాయ్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ వైస్ ఎంపీపీపై అవిశ్వాసం



ఫామ్-2ను అందజేస్తున్న ఎంపీటీసీలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 13 : వేములవాడ అర్బన్ మండలంలోని వైస్ ఎంపీపీపై మంగళవారం సంకెపల్లి బీజేపీ ఎంపీటీసీ బుర్ర లహరి, అనుపురం కాంగ్రెస్ ఎంపీటీసీ బాస రాజశేఖర్, చీర్లవంచ బీఆర్ఎస్ నుంచి గెలుపొంది తాజాగా కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ వనపర్తి దేవరాజు ఆర్డీవో ముదుసూదన్‌ను కలిసి అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. అర్బన్ మండలంలోని ఆరుగురు ఎంపీటీసీలకు ముగ్గురు అవిశ్వాసానికి తెరలేపారు.

పట్టాల మార్పిడికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : పట్టాల మార్పిడికి సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అనుపురం మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎర్రం మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ అండ్ ఆర్ కాలనీ అనుపురంలో ఇచ్చిన పట్టాలను అధికార బలంతో మాజీ సర్పంచ్ తనకు అనుకూలమైన చోటుకు మార్పులు చేశారని, అనుపురం గ్రామానికి చెందిన ఆర్ అండ్ ఆర్ కాలనీ నివాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ కాలనీ అనుపురం పునరావాస ప్యాకేజీ కింద గ్రామానికి చెందిన కొండపల్లి అమృతమ్మకు ప్లాట్ నెంబర్ 921, కొండపెల్లి సుమన్‌కుమార్‌కు ప్లాట్ నెంబర్ 922 కేటాయించారన్నారు. అనుపురం మాజీ సర్పంచ్ ఆ ప్లాట్ల స్థానంలో కరీంనగర్, - కామారెడ్డి రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్లాట్లను అధికారుల సహకారంతో తీసుకున్నారని ఆరోపించారు. అధికారులు స్వయంగా ఆర్ అండ్ ఆర్ కాలనీకి వచ్చి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అనుపురం ఆర్ అండ్ ఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

పద్మశాలీలను అవమానించిన మున్సిపల్ అధికారులు



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : సిరిసిల్ల పద్మశాలీలను సిరిసిల్ల మున్సిపల్ అధికారులు అవమానించారని సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం పద్మశాలి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో శివభక్త మార్కండేయ స్వామి జయంతి నిర్వహించామన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలకు, పద్మశాలి సంఘం, అనుబంధ సంఘాల నాయకులు, పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో శివభక్త మార్కండేయ జయంత్యుత్సవాలను దాదాపు 12 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 50 ఏళ్లుగా నూలు, రాఖీపౌర్ణమి ఉత్సవాలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద నేతన్న విగ్రహానికి శివభక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు, నూలు, రాఖీ పౌర్ణమి సందర్భంగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఏటా పూలతో అలంకరించేవారని, శివభక్త మార్కండేయ జయంతి ఉత్సవం సందర్భంగా అలంకరించకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది నూలుపోగు రాఖీ పౌర్ణమి రోజు లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సంబంధిత అధికారులు మూసి అవమానించారని ఆరోపించారు. పద్మశాలీ సమాజానికి మున్సిపల్ కమిషనర్ సంజాయిషీ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య, కోశాధికారి కోడం శ్రీనివాస్, డైరెక్టర్ దాసరి వెంకటేశం, శ్రీరాముల వెంకటేశం పాల్గొన్నారు.

పద్మశాలీ యువజన సంఘం బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : సిరిసిల్ల పద్మశాలీ యువజన సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం పద్మశాలీ సంఘం కార్యాలయంలో పద్మశాలి యువజన సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ పద్మశాలి యువ జన సంఘం బలోపేతం, నూతన కార్యవర్గం ఏర్పాటు కోసం నూతన సభ్యత్వ నమోదు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పట్టణానికి చెందిన 18 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న యువకులు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతన సభ్యత్వ నమోదుకు రూ.250, సభ్యత్వం ఉన్న సభ్యులు రెన్యూవల్ కోసం రూ.150 చెల్లించి దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుంచి మార్చి 1 వరకు సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. సమావేశంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి గెంట్యాల శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి వేముల ప్రకాష్, కార్యనిర్వాహక కార్యదర్శి వాసం శివశంకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

లింగాపూర్‌కు చేరిన ప్రజాహిత యాత్ర

గంభీరావుపేట, ఫిబ్రవరి 13: కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర మంగళవారం రాత్రి గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామానికి చేరింది. యాత్ర లింగాపూర్‌కు చేరగానే బీజేపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. యాత్ర లింగాపూర్ నుంచి రాజేశ్వర్‌రావునగర్, గజసింగవరం, గోరంటాల, మల్లుపల్లె, నాగంపేట, దమ్మన్నపేట, జగదాంబాతండ మీదుగా గంభీరావుపేట మండల కేంద్రానికి చేరుకుంది. లింగాపూర్‌లో వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ బండి సంజయ్ ముందుకుసాగారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు రాణీరుద్రమ. మండల అధ్యక్షుడు గంట అశోక్, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దెవసాని కృష్ణ, గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, నాయకులు వాజీద్‌హుస్సేన్. మహేష్. పెద్దూరు పర్శాగౌడ్, లక్ష్మిపురం రాజు, స్వామిరాజు, దేవయ్య ఉన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఈ నెల 22న నిర్వహించనున్న ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరు కావాలని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో గ్రామస్థులు కలిసి ఆహ్వానించారు. ఉత్సవాలకు హాజరవుతానని మంత్రి పొన్నం పేర్కొన్నారని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారికి ఆహ్వాన పత్రికను అందించారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, రామాలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు నారాయణరెడ్డి, నర్సయ్య ఉన్నారు.

యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13:పాలిస్టర్ పవర్‌లూం వస్త్ర పరిశ్రమలో అనాధికారికంగా బంద్ పాటిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లాల్ బావుటా చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్ర పరిశ్రమను కొద్ది మంది యజమానులు వారి చెప్పుచేతుల్లో ఉంచుకొని లాభాలు వచ్చినప్పుడు మాత్రమే పవర్‌లూమ్స్‌ను నడుపుతున్నారని, నష్టాల పేరుతో పవర్‌లూం పరిశ్రమను అనాధికారంగా బంద్ చేస్తున్నారని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం పాలిస్టర్ పవర్‌లూం పరిశ్రమను ఏకపక్షంగా బంద్ చేయాలని నిర్ణయం తీసుకోకున్నారని, ప్రభుత్వం, కార్మిక సంఘాల ఒత్తిడితో యాజమాన్యాలు దిగివచ్చి తిరిగి ఉత్పత్తులను ప్రారం భిస్తామని చెప్పారని అన్నారు. ఎస్ఎస్ఐ, మ్యాక్స్ సొసైటీలు కొద్ది మంది యజమానుల వద్దనే ఉన్నాయని, వాటిపై కోట్లాది రూపాయాలు గడించిన యజమానులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లేశం, నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు పాల్గొన్నారు.

నల్గొండకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



సిరిసిల్ల నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముడు పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, నదుల వాటాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్గొండలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలు, నీళ్ల వాటా కోసమే బీఆర్ఎస్ పోరాటమన్నారు. మనకు రావాల్సిన నదీజలాలను తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, నాయకులు బొల్లి రామ్మోహన్, దిడ్డి రాజు, మల్లారెడ్డి, సికిందర్, దేవదాస్, మండలాల నాయకులు ఉన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు చీటి వెంకటనర్సింగరావు, గాడిచర్ల దేవయ్య, సంతోష్‌రావు, చెవుల మల్లేశ్, లక్ష్మణ్, కోడె శ్రీను, మెంగని మనోహర్, శీలం స్వామి, ఖైతీ నవీన్, రాంచంద్రారెడ్డి, పడిగె అంజనేయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నుంచి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దయాకర్‌రావు, నాయకులు లక్ష్మణ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటి, రాజనర్సు, వహీద్, శివయ్య అభిలాష్, చేరాల వెంకటస్వామి, శ్రీమతి, లతారెడ్డి, నాగరాజు, మల్లేశం, బాలకిషన్‌రావు, దేవేందర్, భిక్షపతి, కుతుబ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో నల్లగొండ బహిరంగ సభకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం తరలివెళ్లాయి. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : నల్లగొండలో నిర్వహించిన సభకు తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. గజభీంకార్ రాజన్న, పడిగెల రాజు, కోడి అంతయ్య, అంకారపు రవీందర్, మాట్ల మధు, వలగొండ వేణుగోపాల్‌రావు, పెద్దూరు తిరుపతి, బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, పూసపెల్లి సరస్వతి, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, పబ్బతి విజయేందర్ రెడ్డి, సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, హైమద్ ఉన్నారు.

వేములవాడ టౌన్: నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభకు జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ అర్బన్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రవి మాట్లాడుతూ కృష్ణా జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్సీరావు నాయకులు ఊరడి రాంరెడ్డి, కొండపల్లి వెంకటరమణరావు, మారవేని మల్లేశం యాదవ్, ముత్త మహేష్, వనపట్ల సందీప్‌రెడ్డి, నర్సింహరెడ్డి, అభిమన్యు యాదవ్, బండారి శ్రీనివాస్, పెరగు పర్శరాములు తదితరులు ఉన్నారు.



వేములవాడలో జడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు